సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: కార్పొరేషన్ పరిధిలో సమస్యలు పరిష్కరించాలి కమిషనర్ రామకృష్ణరావుకు బీజేపీ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నిజాంపేట్ అధ్యక్షుడు నరేంద్రచౌదరి మాట్లాడుతూ.. ఇన్‌కాయిస్ సర్కిల్ నుంచి ప్రగతినగర్ మూడుకోతుల బొమ్మ సర్కిల్ వరకు ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జామ్ అవుతుందన్నారు. గుంతలమయంగా మారిన అంతర్గత రోడ్లను బాగు చేయాలని, దోమల బెడదను నివారించాలని కోరారు. అంబీర్ చెరువు సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఎంఆర్ఎస్ రాజు, ప్రొఫెసర్ చంద్రమౌళి, మదన్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, మైలారం అశోక్, సంతోష్‌గౌడ్, నవ్య, సాయి కిషోర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు శాశ్వత అడ్డాను నిర్మించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు ఏసురత్నం

జగద్గిరిగుట్ట: ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు శాశ్వత అడ్డాను నిర్మించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. బుధవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో ఉన్న కార్మిక అడ్డా వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు శాశ్వత అడ్డా నిర్మించి, సౌకర్యాలు కల్పించాలని అధికారులకు పలు మార్లు వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. పైప్‌లైన్ రోడ్డులోని రాంకీ డంపింగ్ యార్డ్ పక్కనున్న ప్రభుత్వ స్థలంలో భవన నిర్మాణ కార్మికుల శాశ్వత అడ్డా నిర్మాణం చేపడితే బాగుంటుందని అన్నారు. ఇప్పుడున్న అడ్డా వద్ద కార్మికులు వివిద సమస్యలను ఎదుర్కొంటున్నారని వివరించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు వి హరినాథరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగప్ప, జగద్గిరిగుట్ట భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హాజరు వేసుకొని డుమ్మాకొడితే చర్యలు

కుత్బుల్లాపూర్ : పారిశుద్ధ్య కార్మికులు హాజరు వేసుకొని విధులకు డుమ్మా కొట్టే వారిపై చర్యలు తీసుకుంటామని కుత్బుల్లాపూర్ డిప్యూటీ కమిషనర్ నరసింహ అన్నారు. పేట్ బషీరాబాద్, చింతల్, పైప్ లైన్ రోడ్డు, సుభాష్ నగర్ ప్రాంతాల్లో బుధవారం ఉదయం నుంచి పలు కాలనీలో కార్మికుల పనితీరును పరిశీలించారు. ఇటీవల పలువురు హాజరు వేసుకున్న తర్వాత ఇంటికి వెళ్లిన వారిపై ఆరా తీశారు.

వసూళ్లపై సమీక్ష

కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. పన్నులు వసూలు చేసే విషయంపై టార్గెట్ విధించారు. ప్రతి రోజు రెండు కోట్ల రూపాయలను వసూలు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సన్మానం


దివ్యాంగుల సంక్షేమ సహకార సంస్థ చైర్మన్‌ను సత్కరిస్తున్న సభ్యులు

సుభాష్‌నగర్: మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ సహకార సంస్థ కార్యాలయంలో సంస్థ చైర్మన్‌ను సూరారం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ సంఘం సభ్యులు సత్కరించారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అంజయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు యాదయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, అంజయ్య, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఫలహారం బండ్ల ఊరేగింపు


నిజాంపేట్‌లో జరిగిన ఫలహారబండి ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్


వెంకట్రామిరెడ్డినగర్‌లో జరిగిన ఫలహారబండి ఊరేగింపు

కుత్బుల్లాపూర్: బోనాల ముగిసిన సందర్భంగా మంగళవారం రాత్రి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో అమ్మవార్ల ఫలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు అంబరాన్నంటాయి. పోతరాజుల నృత్యాల మధ్య ఫలహార బండిని పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లగా.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిజాంపేట్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, ఎన్టీఆర్‌నగర్‌లో బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు బాలాజీ నాయక్, కాసాని సుధాకర్

నిజాంపేట్: పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కార్పొరేటర్లు బాలాజీ నాయక్, కాసాని సుధాకర్ కోరారు. బుధవారం బాచుపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి, ఇందిరనగర్ కాలనీలోని బైరున్ చెరువును ఆనుకుని నివసిస్తున్న పేదలకు శాశ్వత ప్రాతిపదికన స్థలాలు కేటాయించాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించాలని కోరారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం ఉపాధ్యక్షుడు పరమేష్ నాయక్, రాజు నాయక్, కొలన్ బాల్‌రెడ్డి, సయ్యద్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కోసం ఆర్థికసాయం

అల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ ప్రాంతానికి చెందిన చందు కారు ప్రమాదంలో గాయపడ్డాడు. కాలుకి ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో విషయం తెలుసుకున్న బీఎస్‌బీవై ట్రస్ట్ చైర్మన్ బీఎస్ వీరు యాదవ్ బుధవారం చందుని పరామర్శించి ఆర్థికసాయాన్ని అందజేశారు.


ఆర్థికసాయం అందజేస్తున్న బీఎస్ వీరు యాదవ్

రోడ్డును ఆక్రమించారు


రోడ్డును ఆక్రమించి ఉంచిన తుక్కు సామాన్ల సంచులు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్ చివరి రోడ్డులో కొంతమంది తుక్కు వ్యాపారులు తక్కు సామాన్లను రోడ్లపై నిలువ చేస్తున్నారు. రోడ్డును ఆక్రమించి వారి సొంత జాగలాగ వాడుకుంటున్నారు. పారిశ్రామిక ప్రాంతం కావడంతో లోడింగ్, అన్‌లోడింగ్ నిమిత్తం నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. 18 ఫీట్లు ఉన్న రోడ్డు.. సామాన్లు వేయడంతో 10 ఫీట్లు మాత్రమే మిగులుతుంది. దీంతో వాహనాలు ఎదురుగా వచ్చినపుడు ట్రాఫిక్‌జాం అవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును ఆనుకుని ఉన్న తుక్కు సామాన్లను తొలగించాలని, సంబంధిత దుకాణదారుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పని ఇప్పిస్తానని .. కత్తితో గాయపరిచి పరార్

జీడిమెట్ల: నగరంలో పని ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి కత్తితో గాయపరిచి ఉడాయించిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బతుకమ్మకొండకు చెందిన యాది(27)కి నిజామాబాద్ పట్టణంలో శ్రీనివాస్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. శ్రీనివాస్ యాదికి మాయమాటలు చెప్పి ఉద్యోగం ఇప్పిస్తానని మంగళవారం జీడిమెట్లకు తీసుకొచ్చాడు. అనంతరం ఇద్దరు కలిసి ఓ వైన్‌షాపు వద్ద రాత్రి వరకు మద్యం తాగారు. మళ్లీ బుధవారం ఇద్దరు కలిసి మధ్యాహ్నం షాపూర్‌నగర్‌లోని ప్రాంతంలోని ఓ మద్యం దుకాణంలో మద్యం తాగారు. మత్తులోనే శ్రీనివాస్ యాది వద్ద ఉన్న డబ్బులు ఇవ్వాలని గొడవ చేశాడు. దీనికి యాది ఒప్పుకోకపోవడంతో ముఖంపై శ్రీనివాస్ దాడికి పాల్పడ్డాడు. అనంతరం యాదిని షాపూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వదిలి పారిపోయాడు. విషయం తెలుసుకున్న డాక్టర్లు యాదిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమైపోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను అడుగగా.. తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఇంటి నెంబర్ | కేటాయింపుల్లో అవినీతి!

- ఒక్కో నెంబర్ కోసం రూ.3 లక్షల వరకు వసూళ్లు
- విచారణ జరిపిస్తామన్న కమిషనర్



మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమంగా ఇంటి నెంబర్లు కేటాయించడంలో అధికారులు, రాజీవ్ గాంధీనగర్‌లోని ఓ కార్పొరేటర్ చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. బాచుపల్లి రాజీవ్ గాంధీనగర్‌లోని ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో ఇండ్లు నిర్మించుకున్న పేదలకు ప్రభుత్వాలు పట్టాలు మంజూరు చేశాయి. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఈ ప్రాంతం మారిన తరువాత ఇంటి నెంబర్లు పొందేందుకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఇంటి నెంబర్లు అవసరం ఉన్న పేదలు స్థానిక ప్రజాప్రతినిధిని ఆశ్రయించినట్లు తెలుస్తోంది. దీంతో తనకున్న అధికారంతో అధికారులను, కింది స్థాయి సిబ్బందిని డబ్బు చూపి అక్రమంగా ఇంటి నెంబర్లను ఇప్పించే విధంగా పనిచేశారన్న చర్చ జరుగుతోంది. ఇందుకు గాను ఒక్కో ఇంటి నెంబర్ కేటాయింపునకు సుమారు రూ. 2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ముడుపులు తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇక్కడ కేటాయించిన మొత్తం 35 ఇంటి నెంబర్లపై ప్రస్తుతం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విస్తృతంగా చర్చ జరుగుతుంది.

విచారణ లేకుండానే కేటాయింపు

పట్టా సర్టిఫికెట్‌తో ఇంటి నెంబర్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించకుండానే నెంబర్లు కేటాయించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో సమర్పించిన పట్టాలు ఒరిజినల్‌వా? లేక నకిలీవా? అని ఆర్వో గాని, ఇటు కమిషనర్ గాని పరిశీలించాలి. ఆ ప్రయత్నం చేయకుండానే కేటాయింపులు జరిగినట్లు తెలుస్తోంది.


1న ఫిర్యాదు చేసి, 23న ఉపసంహరించుకుంటున్నట్లు ఇచ్చిన దరఖాస్తు

కేటాయింపులో ఏవరి పాత్ర ఎంత?

రాజీవ్ గాంధీనగర్‌లో అక్రమంగా ఇంటి నెంబర్ల కేటాయింపులో చేసిన వసూళ్లల్లో ఏవరి పాత్ర ఎంత అనేది అంతు చిక్కడం లేదు. ఇంటి నెంబర్ కేటాయించాలంటే క్షేత్ర స్థాయిలోని బిల్ కలెక్టర్‌తో పాటు ఆర్ఐ, ఆర్వో, కమిషనర్ స్థాయి అధికారి వరకు పర్యవేక్షణ ఉంటుంది. ఈ 35 ఇంటి నెంబర్ల కేటాయింపుల్లో అవినీతి జరిగి ఉంటే అందరి పాత్ర ఉందా? లేక కమిషనర్‌కు సమాచారం లేకుండానే కింది స్థాయి ఉద్యోగుల పాత్రనే ఉందా ? అనేది పూర్తి స్థాయి విచారణ జరిగితే కాని తెలిసేటట్లు లేదు.

ఫిర్యాదు చేసి ఉపసంహరణ

ఇంటి నెంబర్ల కేటాయింపుల్లో బిల్ కలెక్టర్ రెండు లక్షలు వసూలు చేస్తున్నాడని రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన బీరప్ప జూలై 1న కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కమిషనర్.. బిల్ కలెక్టర్ లక్ష్మణ్ అనే వ్యక్తిని విధుల నుంచి తాత్కాలికంగా పక్కన పెట్టారు. జూలై 1న ఫిర్యాదు చేసిన వ్యక్తే 23న తాను చేసిన ఫిర్యాదు తప్పు అని, గతంలో ఇచ్చిన ఫిర్యాదును ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. అయితే ఈ ఫిర్యాదు చేసిన వ్యక్తి అసలు ఎవరు? ఎక్కడ ఉంటాడు? అనే వివరాలు ఫిర్యాదులో లేకపోవడం విశేషం. స్థానిక కార్పొరేటర్ మాట బిల్ కలెక్టర్ వినడం లేదనే కక్షతోనే బీరప్పను సృష్టించి ఫిర్యాదు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వేళ పూర్తి విచారణ జరిగితే తమ బాగోతం ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతో కూడా ఆ ప్రజాప్రతినిధే ఫిర్యాదును ఉపసంహరింపజేశాడన్న చర్చ కూడా నడుస్తోంది.

పూర్తి విచారణ చేస్తున్నాం

ఇంటి నెంబర్ల కేటాయింపు వ్యవహారంలో జరిగిన అవకతవకలపై పూర్తి విచారణ చేపడుతున్నాం. ఎవరైనా తప్పుడు పత్రాలు సృష్టించి ఇంటి నెంబర్లు పొందినట్లు తేలితే వాటిని వెంటనే రద్దు చేస్తాం. చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణారావు, కమిషనర్

నేతల ముందస్తు అరెస్ట్

జగద్గిరిగుట్ట : బీజేపీ మహిళా మోర్చా అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో బుధవారం డివిజన్ నుంచి తరలి వెళ్తున్న మహిళా మోర్చా నాయకురాళ్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్, కార్పొరేటర్ రావుల శేషగిరి స్టేషన్‌కు వెళ్లి వారిని పరామర్శించారు. ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని అన్నారు. రాజమణి, వసుంధర, గీత తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.

అఘాయిత్యాలను అరికట్టడంలో విఫలం

కుత్బుల్లాపూర్: రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సరిత అన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి సందర్భంగా కొంపల్లిలోని ఆమె నివాసంలో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

సుభాష్‌నగర్: ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన సుబ్బారావు (65) సాయిబాబా నగర్‌లో నివాసముంటున్నాడు. స్థానికంగా ఉన్న ఓ స్క్రాప్ దుకాణంలో ఆరు సంవత్సరాలుగా వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్యకు కుమారుడు, రెండవ భార్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



అల్విన్‌కాలనీ: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని 55 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని సీఎంఆర్ఎఫ్ పథకం ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని అన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి, చంద్రకాంత్‌రావు, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి


పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు తదితరులు

కుత్బుల్లాపూర్: ప్రతి ఒక్కరికి రాజ్యాంగంపై అవగాహన ఉండాలని దళిత నాయకుడు బేకు ఆనంద్‌బాబు అన్నారు. జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్‌లో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన దళితులకు ఇల్లు, పింఛన్, తెల్ల రేషన్‌కార్డు, ఉచిత విద్యుత్, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పలు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశ్విన్‌కుమార్, ఆర్ఐ రేణుకాదేవి, పౌర సరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ మ్యాథేష్, ఎలక్ట్రికల్ ఏఈ జ్ఞానేశ్వర్, జలమండలి ఏఈ శివప్రసాద్, ఎస్ఐ లావణ్య, దళిత నాయకులు గట్టు అశోక్, కిషన్‌రావు, అనిల్, కవిత, ఇంద్ర, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు


కట్టమైసమ్మ

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయ 6వ వార్షికోత్సవాన్ని గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు భాస్కరభట్ల రవిశర్మ తెలిపారు. 1న ఉదయం 8 గంటలకు గురుప్రార్ధన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపస్థాపన, దీక్షాధారణ, ధ్వజారోహణం, సాయంత్రం 5 గంటలకు ఆవాహితదేవతా పూజ, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ, లక్ష్మీగణపతి, 2న ఉదయం 8 గంటలకు మూల మంత్ర అనుష్ఠానం, అష్టోత్తర సుగంధ ద్రవ్యాలతో మూలవిరాట్‌కు 108 కళశాలతో మహాకుంభాభిషేకం, సాయంత్రం 5 గంటలకు ఆవాహితదేవతా పూజ మూల మంత్ర హవనం, లక్ష పుష్పార్చన, వేదస్వస్తి రాజోపచారసేవ, 3న ఉదయం 7 గంటలకు చండీ నవవర్ణార్చన, మహాచండీ హవనం, మహా బలిప్రదానం, ఉదయం 10.45 గంటలకు మహాపూర్ణాహుతి, మహాకుంభసంప్రోక్షణ, వేద ఆశీర్వచనం, పండిత సత్కారం, మధ్యాహ్నం అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ పేర్కొంది.

మత్స్యకారులకు త్వరలో సభ్యత్వ కార్డులు

మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్


సమస్యలు తెలుసుకుంటున్న మెట్టు సాయికుమార్ తదితరులు

కూకట్‌పల్లి: ఆన్‌లైన్ విధానంతో మత్స్యకారులకు త్వరలో సభ్యత్వ కార్డులు అందజేస్తామని, వారికే ఫిష్ మార్కెట్‌లో వ్యాపారం చేసుకోవడానికి అర్హత ఉంటుందని మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. కేపీహెచ్‌బీ కాలనీ పోస్టాఫీస్ క్వార్టర్స్ పక్కన ఉన్న ఫిష్ మార్కెట్‌ను బుధవారం సందర్శించారు. ఫిష్ మార్కెట్‌లో తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చేసిన అక్రమాలపై విచారణ జరుపుతామన్నారు. సభ్యులు కాని వారికి మార్కెట్‌లో వ్యాపారం చేసుకోవడానికి అవకాశాలు ఉండవన్నారు. నిజమైన మత్స్యకారులను ఇబ్బంది పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ ఆఫీసర్ పూర్ణిమ సింగ్, జిల్లా ఫిషర్మెన్ చైర్మన్ మన్నె రాజు, వైస్ చైర్మన్ కాపర్తి కృష్ణ మోహన్, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కూకట్‌పల్లి మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, సంజీవరావు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షురాలిగా హన్సికరెడ్డి

అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సప్తగిరి కాలనీలో ఓసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి నివాసంలో బుధవారం ఓసీ సంఘం సమావేశం జరిగింది. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షురాలిగా హన్సికరెడ్డిని నియమిస్తూ ఓసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకట సుబ్బారెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఓసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, రాయలసీమ ఐటీ విభాగం అధ్యక్షుడు సురేష్ కుమార్, రామిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, శంకర్‌రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్



దుండిగల్: బౌరంపేట్‌లోని సర్వే నెంబరు 166లోని ప్రభుత్వ స్థలాన్ని బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పరిశీలించారు. అక్రమ నిర్మాణాలపై ఆరా తీశారు. ఆయన వెంట మల్కాజిగిరి ఆర్డీఓ శ్యామ్‌ప్రకాష్, తహసీల్దార్ మతిన్, సర్వేయర్ భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్లు అందజేత


సర్టిఫికెట్లను అందజేస్తున్న సురేష్‌కుమార్, సుజాత

చింతల్: లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో లయన్ సూర్యరాజ్ సహకారంతో చింతల్ గణేష్‌నగర్‌లోని ప్రధాన కార్యాలయంలో కొన్ని సంవత్సరాలుగా మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణను నిర్వహిస్తున్నారు. 11వ బ్యాచ్‌కు చెందిన వారు ఇటీవలే శిక్షణను పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ లయన్ సురేష్‌కుమార్, లయన్ సుజాత, కుట్టు మిషన్ శిక్షణ ట్రైనర్లు లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పట్టా భూములుగా మార్చాలి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్

జగద్గిరిగుట్ట: అసైండ్ భూములను పట్టా భూములుగా మార్చి రైతులకు వాటిపై శాశ్వత హక్కులను కల్పించాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమావేశం దుర్గయ్య అధ్యక్షతన జగద్గిరిగుట్టలోని నల్లమల్ల గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసైండ్ భూములకు పూర్తి హక్కులు కల్పిస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో సహా మిగతా పార్టీలు సైతం హామీ ఇచ్చాయని గుర్తు చేశారు. సమావేశంలో ఏసురత్నం, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్, జిల్లా కార్యదర్శి సహదేవ్, రాష్ట్ర సమితి సభ్యులు డి రాములు, ఎల్లయ్య, రామస్వామి. మిరియాల సాయిలు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి


ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న స్కూల్ చైర్మన్ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: విద్యార్థులు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని బీపీఎల్ ఒలింపియాడ్ స్కూల్ చైర్మన్ కోటిరెడ్డి అన్నారు. బుధవారం చింతల్ వేంకటేశ్వర్ నగర్‌లోని స్కూల్‌లో హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌తో పాటు వివిధ సెక్షన్ల లీడర్లతో ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. మదర్ థెరిస్సా పాఠశాల కరస్పాంటెండెంట్ మౌని విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

సాయిలు మృతి బాధాకరం


నివాళులర్పిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

నిజాంపేట్: గజ్జెల్లి సాయిలు మృతి బాధాకరమని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. బుధవారం సాయినగర్‌లో నిర్వహించిన సాయిలు దశదిన కర్మకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల పక్షాన పోరాడిన వ్యక్తి సాయిలు అని గుర్తు చేశారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కాలనీ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

ఉద్యోగ విరమణ.. సన్మానం


అనురాధను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సుభాష్‌నగర్: సూరారం కాలనీ జడ్పీహెచ్ పాఠశాలలో బుధవారం సాంఘికశాస్త్రం ఉపాధ్యాయురాలు గవ్వల అనురాధ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం అనురాధకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జావిద్, హనుమంతరావు, పుణ్యవతి, మల్లికార్జున్, వెంకటరావు, సురేష్ బాబు, కరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బాలానగర్: రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన సొంత నిధులతో బుధవారం బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నరసింహులు, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీ అధ్యక్షులు పాల్గొన్నారు.